క్లుప్తంగా

కోలా గురువులుకు అభినందనలు



కోలా గురువులును అభినందిస్తున్న రంధి గోపికృష్ణ తదితరులు

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులును 33వ వార్డు నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసారు. మద్దిలపాలెం జిల్లా పార్టీ కారాయలయంలో వార్డు అధ్యక్షుడు రంధి గోపికృష్ణ, వార్డు మహిళా అధ్యక్షురాలు వెల్లంకి చిన్నమ్మలు, నగర కార్యదర్శి మేడం నారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు భీశెట్టి రాజు, మదీనా ఖాన్, సంతోష్ కలిసి అభినందనలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యేకు అండగా గౌరీ సంఘాల ప్రతినిధులు

అల్లిపురం : వెంకటేశ్వరమెట్ట సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కష్టపడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు అండగా వెంకటేశ్వరమెట్ట, అల్లిపురం, బంగారుమెట్ట గౌరీ సేవా సంఘాల ప్రతినిధులు తమ పూర్తి మద్దతు తెలిపారు. వెంకటేశ్వమెట్టలో నివసిస్తున్న గృహస్తులకు ఎమ్మెల్యే అండగా నిలబడటం పట్ల వారు వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఆసీలమెట్టలో గల ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. తమ సమస్య పట్ల ప్రతి వారం జిల్లా కలెక్టర్‌ను కలసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని, ఆయనతోనే తమ సమస్య పరిష్కారం అవుతుందని, గత దశాబ్ద కాలంగా తాము పడుతున్న కష్టాలు తీరుతాయని వారు నమ్మకం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, వెంకట గౌరీ శంకర గ్రంథాలయం, గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు భీశెట్టి నరసింహమూర్తి (శ్రీను), కార్యదర్శి శరడం మోహన్‌రావు, అల్లిపురం గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి శ్రీను, కార్యదర్శి పెంటకోట రఘు, బంగారుమెట్ట గౌరీ సేవా సంఘం కార్యదర్శి భీశెట్టి హనుమంతరావు, కార్యవర్గ సభ్యులు, వెంకటేశ్వర మెట్ట హౌస్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యదర్శుల పదోన్నతుల అంశం పరిశీలన

మహారాణిపేట : వార్డు పరిపాలన కార్యదర్శుల సమస్యలు పరిష్కరించడంతో పాటు వారి పదోన్నతుల విషయంలో సహకరిస్తానని రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ పి.కోటేశ్వరరావు హామీ ఇచ్చినట్టు గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ తెలిపారు. బుధవారం అమరావతిలో రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషాఆధ్వర్యంలో డైరెక్టర్ కోటేశ్వరరావును కలిసిన ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు వినతిపత్రాలు అందించారు. ఫెడరేషన్ అందించిన వినతులపై పూర్తిస్థాయిలో అధికారులతో సమీక్ష జరుపుతామని డైరెక్టర్ హామీ ఇచ్చారని గణేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు గడువు 31 వరకు పెంపు

తగరపువలస(భీమిలి): దక్షిణ భారత హిందీ ప్రచార సభ-చెన్నై ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో జరిగే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపునకు ఈ నెల 31 వరకు గడువు పెంచారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, ప్రవేశికలకు అపరాధ రుసుం లేకుండా, హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారధ పూర్వార్ధ, రాష్ట్రభాష విశారధ ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్రభాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలకు రూ.10 అపరాధ రుసుంతో ఈ ఫీజులు చెల్లించవచ్చు. ఈ పరీక్షలకు భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌ను కేంద్రంగా ఎంపిక చేశారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 89856 47419, 89858 97419లలో సంప్రదించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి-భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

బిక్కు బిక్కు మంటూ..



భయపెడుతున్న పురాతన కట్టడం

- కాలం వెళ్లదీస్తున్న పాతనగర వాసులు
- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తడిసి ముద్దయిన పాతనగరం
- ఎప్పుడు ఏ బిల్డింగ్ కూలుతుందో తెలియని పరిస్థితి

దాబాగార్డెన్స్ : పాతనగర వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే భయం గుప్పిట్లో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. గత నాలుగైదు రోజులు గా నగరంలో కురుస్తున్న కుంభవృష్టికి పాతనగరంలో పలు పురాతన గృహాలు తడిసి ముద్దయ్యాయి. ఎప్పుడు కూలుతాయోనన్న భయంతో ఆ ప్రాంతవాసులు వణికిపోతున్నారు. పలువురు ఇంటి యజమానులు శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను కూల్చకుండా ఉంచేయడంతో ఆ ఇళ్లల్లో అద్దెకుంటున్న వారు ప్రమాదపుటంచుల్లో ఉన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లకు జీవీఎంసీ నోటీసులు జారీ చేసినా స్పందించడం లేదంటూ అధికారులే చెబుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విరివిగా వర్షాలు కురుస్తున్నాయి. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వానలకు దక్షిణ నియోజకవర్గంలోని పాతనగరంలో పాత ఇళ్లల్లో నివసిస్తున్న వారికి భయం పట్టుకుంది.



పాతనగరంలో శిథిలావస్థకు చేరుకున్న ఇలాంటి ఇళ్లు కోకొల్లలు

కూల్చివేయాలని అధికారులు చెప్పినా..

పాతనగరంలో చాలా ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాంటి కొన్ని ఇళ్లల్లో ఎవరూ లేకపోయినా కొంత మంది అభాగ్యులు ఆ ఇళ్లల్లో తలదాచుకుంటున్నారు. మరి కొన్ని ఇళ్లల్లో అద్దెకు ఉన్న వారు ఖాళీ చేయకపోవడం, ఇంటి యజమానులు కూడా పట్టీ.. పట్టనట్టు ఉండటంతో శిథిల గృహాలు అలాగే కొనసాగుతున్నాయి. సాక్షాత్తు జీవీఎంసీ యంత్రాంగం శిథిలావస్థకు చేరుకున్న ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ పలువురు స్పందించలేదు.

పాతనగరంలో కోకొల్లలుగా పాత ఇళ్లు..

విశాఖ పాతనగరంలో శిథిలావస్థకు అనేక ఇళ్లు చేరాయి. గత ప్రభుత్వాలు నిర్మించిన స్కీం ఇళ్లతో పాటు వాంబే గృహాలు కూడా పెచ్చులూడుతున్న సందర్భాలున్నాయి. ఏ పాటి వర్షం కురిసినా వారంతా బిక్కుబిక్కుమంటున్నారు. ముఖ్యంగా పాతనగరంలోని కోటవీధి, పాతపోస్టాఫీస్, అంబుసరంగు వీధి, చాగంటివారి వీధి, థామ్సన్ స్ట్రీట్, రెల్లివీధి, చిలకపేట, పద్మానగర్, తారకరామ కాలనీ తదితర ప్రాంతాల్లో పలు గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

ఎప్పుడేం జరుగుతుందో తెలియటం లేదు..



ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఆందోళనగా ఉంది. రోడ్డుపై వెళ్తుంటే ఎప్పుడు కూలుతుందో తెలియక భయంగా ఉంటుంది. ఇంటి యజమానికి కూడా చాలాసార్లు చెప్పాం. ఆయన కూడా నా వంతుగా నోటీసులు ఇచ్చానని చెబుతున్నారు. అధికారులు త్వరగా స్పందించి చర్యలు తీసుకోవాలి.
– బొడ్డు పోలారావు, కెప్టెన్ రామారావు జంక్షన్

నోటీసులు ఇచ్చాం

బిల్డింగ్ ప్రమాదకరంగా మారింది. అందుకే మేం ఖాళీ చేసి వెళ్లిపోయాం. షాపు యజమానులకు నోటీసులు ఇచ్చాం. కానీ వాళ్లు పట్టించుకోలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసాం. జీవీఎంసీ అధికారులకు తెలియజేశాం. వారు ఖాళీ చేస్తే బిల్డింగ్ పడగొట్టేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ఎటువంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
– టి.లక్ష్మణరావు, ఇంటి యజమాని

స్పందించకపోతే కూల్చేస్తాం..

పాతనగరంలో శిథిలావస్థకు చేరుకున్న పలు పాత భవనాలకు జీవీఎంసీ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న వారిలో కొందరు ముందుకొచ్చి పాత భవనాలు నేలమట్టం చేస్తున్నారు. మరికొంత మంది యజమానులు స్పందించకుండా భీష్మించుకుంటున్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలకు సంబంధించి యజమానులకు నోటీసులిచ్చి హెచ్చరికలు జారీ చేస్తున్నాం. స్పందించకపోతే కూల్చేందుకు జీవీఎంసీ సిద్ధం.
– వినయ్‌కుమార్, అసిస్టెంట్ పట్టణ ప్రణాళికా అధికారి, జీవీఎంసీ

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం



ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం చేసేందుకు భక్తులు పసుపునీళ్లతో బారులుతీరారు. అర్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకంతో పాటు పూజలు చేశారు. అనంతరం అమ్మవాకి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. భక్తుల నామగోత్రాలతో విశేష పూజలు జరిపారు. ఎరుకుమాంబ అమ్మవారు కలియుగంలో వెలసిన పార్వతీదేవిగా భక్తులు నమ్ముతారు. ప్రతి బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు అమ్మవారికి పసుపు నీళ్లతో అభిషేకం చేయటం ఆచారంగా వస్తుందని అర్చకులు తెలిపారు. దొండపర్తి, రైల్వేన్యూకాలనీ, పెద్దవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్‌ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసవాని పాలెం, జగదాంబ, వన్‌టౌన్, నెహ్రూబజారు, నర్సింహనగర్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. సాయంత్రం అమ్మవారికి పసుపు, కుంకుమ, పలురకాల పూలతో అలంకరించారు. అమ్మవారి దర్శనానంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 16.24 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీల లెక్కింపు నిర్వహించారు. 46 రోజులకు గాను అమ్మవారి దర్శనాలకు సంబంధించి రూ.16,24,024 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. టర్నర్ చౌల్ట్రీ దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి ఎస్. ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది షేక్ హజరుద్దీన్, లక్ష్మీనారాయణ, ఇందిరరాణి, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు వినతి



చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు

మహారాణిపేట : కాంట్రాక్టు హెల్త్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పలువురు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అమరావతిలో ఏపీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రాజారావు ఆధ్వర్యంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, సర్వీసుల సలహాదారు ఎస్.చంద్రశేఖరరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అర్హతలున్న ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఆయనను కోరారు. సలహాదారును కలిసిన వారిలో నాగరాణి, సోమా మాణి, అనురాధ, శ్రీలక్ష్మి, చైతన్య, నాగరాజు, అన్నపూర్ణ, సౌమ్య, కిషోర్, వలి, నిరంజన్, పల్లవి, చిన్న, చందన, ప్రశాంతి, రవి నాయక్, విజయలక్ష్మి, వినయ్, చిన్న వెంకయ్య, రజనీ, చక్రవర్తి, శిల్పా కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న జహీర్ అహ్మద్

జగదాంబ : స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో బుధవారం పాదరక్షలు పంపిణీ చేశారు. స్వర్గీయ చోడిపిల్లి కృష్ణవేణి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు జహీర్ అహ్మద్ పాల్గొని అన్నసమారాధన చేశారు. పేదలకు అన్న, వస్త్రదానం చేస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు పాదరక్షలు పంపిణీ చేయడం మంచి కార్యక్రమం అన్నారు. సంస్థ అధ్యక్షుడు అప్పారావు, చోడిపిల్లి అప్పారావు, సభ్యులు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమిపూజ



బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

కంచరపాలెం : జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిలో బీటీ రహదారుల నిర్మాణానికి 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ రహదారి నుంచి కాన్వెంట్ కూడలి, అటు జ్ఞానాపురం రైల్వేస్టేషన్ నుంచి ఎఫ్‌సీఐ గిడ్డంగి వరకు సుమారు రూ.40 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు జోన్‌-5 ఇంజినీరింగ్ ఈఈ ప్రసన్నరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వేశంగిణీరావు, రాజు, శ్రీను, కుమార్, ఆనంద్, జయరాజు, శేఖర్, కార్తీక్, సాయి, వంశీ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు, గర్భిణులకు టీకాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పిల్లలు, గర్భిణులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం ఈశ్వరి మాట్లాడుతూ ప్రతి రెండో బుధవారం, శనివారం వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. 45 రోజుల నుంచి 16 ఏళ్ల వయసు గల వారికి వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. గర్భిణులకు మూడో నెలలో ఒక సారి, నాల్గో నెలలో ఒక సారి డోస్ వేస్తామని, పిల్లలకు పోలియో, పచ్చకామర్లు, మెదడవాపు వ్యాధి, విరోచనాలు, వాంతులు రాకుండా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. రేసపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మొదటి, మూడో బుధవారాలు వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మరో ఏఎన్‌ఎం కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ గౌరి పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

దాబాగార్డెన్స్ : ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బారావు, సిటు ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. సిటు కార్యాలయంలో బుధవారం ముఠా కార్మికుల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 2న రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ముఠా కార్మికులందరూ విజయవాడకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వై. రాజు, టి. పైడిరాజు, సిటు నాయకుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లజెండాలతో పురందేశ్వరికి స్వాగతం పలుకుతాం

దాబాగార్డెన్స్ : విశాఖలో పురందేశ్వరి పర్యటనలో నల్ల జెండాలు, నల్ల బెలూన్లతో స్వాగతం పలుకుతామని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జేటీ రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి వట్టి చేతులతో వస్తున్న బీజేపీ నాయకురాలు పురందేశ్వరి పర్యటనలో ఎక్కడికక్కడ నల్లజెండాలు, నల్ల బెలూన్లతో నిరసన తెలుపుతామన్నారు. ఆమె ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఏ ఒక్క సమస్య మీద మాట్లాడకుండా ముఖం చాటేసి, ఇప్పుడు అవే సమస్యలపై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. త్వరలోనే విశాఖకు భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు రానున్నారని చెప్పారు.

'ఆంతే' పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతమ్మధార : జాతీయ స్థాయిలో స్కాలర్‌షిప్ సాధించేందుకు నిర్వహించే ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ (ఆంతే -2023) పోటీ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ తెలిపారు. బుధవారం ద్వారకానగర్ 2వ లైన్‌లో గల సంస్థలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అక్టోబర్ 1 నుంచి 15 మధ్య ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులు పరీక్షకు అర్హులన్నారు. ఏడు వందల మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ హెడ్ పింకు ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జనతాబజార్‌లో చెరువును తలపిస్తున్న రోడ్డు

కుమ్మేసిన వాన

- నీట మునిగిన పూర్ణామార్కెట్ పరిసర ప్రాంతాలు
- స్తంభించిన జనజీవనం
- నిలిచిపోయిన ట్రాఫిక్



పోర్టు ఏరియాలో..



రామకృష్ణ జంక్షన్ వద్ద భారీగా చేరిన వర్షపు నీరు



పూర్ణామార్కెట్‌లోని ఒక దుకాణం వద్ద నిలిచిపోయిన వర్షపు నీరు



జ్ఞానాపురం గెడ్డవీధిలో చేరిన వర్షపు నీరు

జగదాంబ : ఎడతెరిపి లేకుండా భారీ వర్షానికి పాతనగరం అతలాకుతలం అయింది. బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో పూర్ణామార్కెట్ పరిధి రహదారులన్నీ జలమయం అయ్యాయి. ముడుకుల లోతు నీళ్లతో రహదారులు నిండిపోయాయి. కేజీహెచ్ దరి ఏవీఎన్ కళాశాల, జగదాంబ ఎగువ నుంచి వచ్చిన నీరు రహదారులపై నిలిచిపోయింది. దీనికి తోడు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు పొంగిపొర్లడంతో పూర్ణామార్కెట్ లోతట్టు ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. దీంతో పాతనగరానికి జలప్రళయం వచ్చినట్టు అనిపించింది. జనజీవనం స్తంభించిపోయి.. ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎక్కడికక్కడే ట్రాఫిక్‌ను మళ్లించినా ఒక కొలిక్కి రాలేదు. దీంతో టౌన్‌కొత్తరోడ్డు, పోర్టు నుంచి ట్రాఫిక్ పోలీసులు దారి మళ్లించి జ్ఞానాపురం వైపు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. పూర్ణామార్కెట్ జంక్షన్, బౌడారారోడ్డు, రామకృష్ణ జంక్షన్, రామకృష్ణరైతుబజార్, డాల్ఫిన్‌హోటల్ డౌన్, 75 ఫీట్ రోడ్డు, వెలంపేట, లక్ష్మీనగర్, రామకృష్ణ నగర్, తారకరామనగర్, ఆర్ఆర్‌ఎంఆర్ రోడ్డు, పూలసందు, నూనెమిల్లు వీధి, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధిలో వర్షం నీరు ఇళ్లలోకి ప్రవేశించడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. బయటికి వచ్చే దారిలేక ఇళ్లలోనే నిలబడి నీళ్లు తోడుతూ ఇబ్బందులకు గురయ్యారు.

నిలిచిపోయిన ట్రాఫిక్..

అల్లిపురం : బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి నగరంలో అన్ని కూడళ్లు ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా భారీ వర్షానికి డైమండ్ పార్కు, రైల్వే న్యూకాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలమెట్ట, చావులమదుం అండర్ బ్రిడ్జి, రైల్వే స్టేషన్, సౌత్ జైలురోడ్డు, దాబాగార్డెన్స్ వరకు ట్రాఫిక్ నిలిచిపోవటంతో వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్‌ను రామకృష్ణ జంక్షన్ మీదుగా కాన్వెంట్ జంక్షన్ వైపు మళ్లించారు. రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ పోలీసులు క్రమబద్ధీకరించారు.

నీట మునిగిన వీధులు..

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం పలు వీధులు నీట మునిగాయి. ఎర్రిగెడ్డకు ఆనుకుని ఉన్న సెబాస్టియన్‌కాలనీ, బాబుకాలనీ, గెడ్డవీధి, రాచవీధి తదితర ప్రాంతాలు మూడడుగుల లోతు నీట మునిగాయి. ఇళ్ల నుంచి రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగు రహదారుల్లో చేరడంతో వీధులు దుర్గంధభరితంగా మారాయి. జోన్‌-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ పర్యవేక్షించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ నేతృత్వంలో పారిశుధ్య సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు.

విక్టోరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి

మహారాణిపేట : ప్రభుత్వ విక్టోరియా (ఘోష) ఆస్పత్రి అభివృద్ధికి వైజాగ్ రౌండ్ టేబుల్ ఎంతో సహకరిస్తుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష, వైజాగ్ రౌండ్ టేబుల్ 77 చైర్మన్ ఎం.తేజ, వైజాగ్ లైడీస్ సర్కిల్ 201 అధ్యక్షురాలు శ్వేత జోష్ తెలిపారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ఉష మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికారాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రసూతి వైద్యానికి అవసరమైన మందులు, సిబ్బందిని అందించడంలో అధికార యంత్రాంగం సహకరిస్తుందని తెలిపారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జి. మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది వైజాగ్ రౌండ్ టేబుల్ 77 అయిదు సంవత్సరాల పాటు ఆస్పత్రి కోసం ఏడాదికి రూ. 30 లక్షలు విరాళంగా ఇస్తామని ప్రకటించిందని అన్నారు. ఈ ఏడాది ల్యాప్రోస్కోప్‌ను ఆస్పత్రికి ఇస్తామని హామీ ఇచ్చా రని వివరించారు. వైజాగ్ రౌండ్ టేబుల్ 77 చైర్మన్ ఎం.తేజ మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి ఎలాంటి సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. క్లినికల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.అనురాధ, ప్రొఫెసర్లు డాక్టర్ గీత వందన, ఆర్.విద్యారమా, వైజాగ్ రౌండ్ టేబుల్ 77 హెచ్‌ఆర్ సంతోష్‌కుమార్, వైజాగ్ లైడీస్ సర్కిల్ 201 నాయకురాళ్లు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్టు తొలగింపు

సీతమ్మధార : దొండపర్తిలోని నూకాలమ్మ గుడికి ఆనుకుని ఉన్న భారీ మర్రిచెట్టు మంగళవారం కూలిపోయిన విషయం తెలిసిందే. జీవీఎంసీ సిబ్బంది దీనిని బుధవారం తొలగించారు. దీంతో యథావిధిగా ఇక్కడ రాకపోకలు జరుగుతున్నాయి. చెట్టు కూలిపోవడంతో దాని పక్కన ఉన్న బడ్డీలతో పాటు గుడి గోడ పాడైయింది. ఈ మర్రిచెట్టుకు సుమారు వంద నుంచి నూట ఇరవై సంవత్సరాల వయసు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

కళాశాలల్లో కార్గిల్ దివస్



అమర వీరులకు నివాళులర్పిస్తున్న క్యాడెట్లు, ప్రిన్సిపాల్ శోభారాణి

దాబాగార్డెన్స్ : కార్గిల్ యుద్ధ వీరుల గౌరవార్థం విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం 'కార్గిల్ విజయ్ దివస్'కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని కార్గిల్ విజయ్ దివస్ ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి అమర వీరుల త్యాగాలు స్మరించుకుంటూ నివాళులర్పించారు. కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌సీసీ కో ఆర్డినేటర్, ఏఎన్‌వో డాక్టర్ కె. గీతాంజలి, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

అమరవీరులే భరతమాత ముద్దు బిడ్డలు..

అమరవీరులే భరతమాత ముద్దు బిడ్డలంటూ ఏవీఎన్ కళాశాల విద్యార్థులు కార్గిల్ విజయదివస్ ర్యాలీ నిర్వహించారు. దేశాన్ని రక్షించేందుకు, దేశ ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు ప్రధాన కారకులు సైనికులేనని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు పేర్కొన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విభాగాలు, విద్యార్థుల ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల డీన్ శంకరనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ అర్చన, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని, స్వరాజ్యలక్ష్మి, కృష్ణకుమారి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.